క్లుప్తంగా

గర్భవతులపై దృష్టి


మాట్లాడుతున్న డాక్టర్ ప్రియంకా, ప్రవీణ

పూతలపట్టు: మండలంలోని ఆశావర్కర్లు గర్భవతులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలని డాక్టర్లు ప్రియంకా, ప్రవీణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో వారు సమీక్షించారు. రక్తపోటు, రక్తహీనత తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్న గర్భవతులను గుర్తించి వారిని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి తీసుకెళ్లి, వైద్య పరీక్షలు చేయించి, మందులు అందజేయాలన్నారు. అనంతరం డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, శేషాద్రి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు యోగాపై శిక్షణ


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా గ్రంథాలయంలో పిల్లలకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం యోగాపై శిక్షకులు వెంకట మహేష్ శిక్షణ ఇచ్చారు. చదవుతో పాటు యోగ, క్రీడలు అవసరమన్నారు. నిత్య జీవితంలో ఒత్తిడిని జయించాలంటే యోగాసనాలు వేయాలన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ అవసరాన్ని శిక్షకులు రమ తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, గ్రంథాలయాధికారులు లలిత, గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నా రు. మంగళవారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల పురోగతి గురించి ఏఎస్‌ఐ చలపతిని అడిగి తెలుసుకున్నారు. మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం, ఎర్రచందనం స్మగ్లర్లు గుడిపాల మీదుగానే అధికంగా వెళ్తున్న నేపథ్యంలో దీనికి చెక్ పెట్టే దిశగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు.

సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్లు సమన్వయంతో హౌసింగ్ లక్ష్యాలను అధిగమించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై మంగళవారం సాయంత్రం కమిషనర్ డాక్టర్ జె.అరుణ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్డీఓ రేణుకతో కలిసి వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్ అధికారులతో జేసీ సమీక్షించారు. జూలై 31 నాటికి నిర్దేశించిన ఇళ్లను పూర్తిచేసేలా వార్డు కార్యదర్శులు పరస్పర సహకారంతో లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. చిత్తూరును మొదటి స్థానంలో నిలపడమే ధ్యేయంగా ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పద్మజ, నగర పాలక, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో ×ప్లాస్టిక్ రీ సైక్లింగ్..వ్యక్తిగత బాధ్యత¤ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో కేవలం 10 శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతోందన్నారు. ప్లాస్టిక్‌కు బదులు పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయాలను వినియోగించాలని కోరారు. సమావేశంలో విజయం కళాశాల సీనియర్ అధ్యాపకులు రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల మోత..'రెవెన్యూ' నిద్రావస్థ

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆర్థిక వనరులను బలోపేతం చేయడంలో రెవెన్యూ విభాగం కీలకంగా వ్యవహరించాలి. ఆస్తి పన్ను, నీటిపన్ను నుంచి మార్కెట్ గేటు వసూళ్లు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సుల నుంచి అద్దెలు వసూలు చేయడంలో వీళ్లు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంది. అయితే కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని పట్టించుకోకపోవడం వల్ల ఖజానాకు భారీగా గండి పడుతోంది. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సుల నుంచి ఏళ్ల తరబడి అద్దెలు వసూలు చేయకుండా రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బకాయిలు రూ.కోట్లకు చేరుకుంది.

- వాణిజ్య సముదాయాల బకాయిలు గాలికి
- రూ.2 కోట్లకు పైగా కార్పొరేషన్‌కు బకాయి పడ్డ వైనం
- దృష్టి సారించిన కమిషనర్
- తనిఖీలతో దుకాణాల సీజ్


చిత్తూరులోని ఏఎస్‌ఎం మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఏఎస్‌ఎం షాపింగ్ కాంప్లెక్సులో 110 దుకాణాలు, ఎంఎస్‌ఆర్ కూడలిలో 50, కస్తూర్బా (ఓటీకే రోడ్డు) 10, జైహింద్ 12, గుర్రప్పనాయుడు 6, కొంగారెడ్డిపల్లె 16, చేపల మార్కెట్‌లో 15 వరకు మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన వాణిజ్య సముదాయ దుకాణాలు ఉన్నాయి. వీటి నుంచి ప్రతీ నెలా వసూలయ్యే అద్దె నగదు కార్పొరేషన్ ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడుతుంది. కానీ దుకాణం లీజుకు తీసుకున్న వారిలో 2014 నుంచి కొందరు కార్పొరేషన్‌కు అద్దెలు చెల్లించలేదు. దీంతో బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. ఏఎస్‌ఎం కాంప్లెక్సులో 47 దుకాణాల నుంచి ఏకంగా రూ.1.21 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కానీ కేవలం అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అలాగే ఎంఎస్‌ఆర్ కాంప్లెక్సులో 27 దుకాణాల నుంచి రూ.48 లక్షలు, కస్తూర్బాలో 2 దుకాణాల నుంచి రూ.లక్ష, జైహింద్‌లో 12 దుకాణాల నుంచి రూ.22.17 లక్షలు, గుర్రప్ప నాయుడులో 6 దుకాణాల నుంచి రూ.39 వేలు, కొంగారెడ్డిపల్లెలో 5 దుకాణాల నుంచి రూ.50 వేలు వసూలు కావాల్సి ఉంది. ఇక చేపల మార్కెట్‌లోని మునిసిపల్ దుకాణాల నుంచి కార్పొరేషన్‌కు రూ.12 లక్షలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఇలా మొత్తంగా రూ.2.30 కోట్ల వరకు కార్పొరేషన్‌కు దుకాణాల నుంచి అద్దె వసూలు కాలేదు. రెండు నెలలు అద్దె చెల్లించకుంటే వెంటనే నోటీసులు జారీ చేసి దుకాణం స్వాధీనం చేసుకోవాల్సిన రెవెన్యూ విభాగం అధికారులు నిద్రావస్థలో ఉండడంతో బకాయిలు పేరుకుపోయాయనే విమర్శలొస్తున్నాయి.

2014 నుంచి అద్దె చెల్లించని వైనం.. విస్తుపోయిన కమిషనర్

దీనిపై దృష్టి సారించిన కార్పొరేషన్ కమిషనర్ అరుణ మంగళవారం ఏఎస్‌ఎం షాపింగ్ కాంప్లెక్సులోని పలు దుకాణాలను పరిశీలించారు. ఇక్కడ కొందరు 2014 నుంచి అద్దె చెల్లించడం లేదని కమిషనర్ గుర్తించి విస్తుపోయారు. అలాంటి దుకాణాలు సీజ్ చేశారు. ఇక పెద్ద మొత్తంలో బకాయిపడ్డ వాళ్లు ఏడు రోజుల్లో మొత్తం చెల్లించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ గోవర్ధన్, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆదాము, వెంకటేష్, అమర్‌నాథ్, సిబ్బంది తనూజ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


బకాయి పడ్డ దుకాణం మూయిస్తున్న కమిషనర్ అరుణ

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె, 190 రామాపురంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ జాతరలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని గ్రామస్తులతో కలసి పూజలు అమ్మవారికి తొలిపూజ చేశారు. తొలుత ఉదయం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి, రాత్రి అమ్మవారిని పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, మండల వైఎస్సార్ కన్వీనర్ జనార్దన్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు కారిమేగస్, శింభ, రజనీకాంత్, రాజా, సాయి, సంపత్, సర్పంచ్ పెరిల్లా, బోస్, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే అడవిచేనులో కూడా గంగమ్మ జాతర వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. పొంగళ్లు, అంబలితో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గంగమ్మను పురవీధుల్లో ఊరేగించారు.

చెర్లోపల్లెలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చెర్లోపల్లెలో మంగళవారం గంగజాతర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారిని శిరస్సును నడివీధిలో కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. తొలిపూజను భక్తిశ్రద్ధలతో చేశారు. ఊరేగింపుగా గ్రామస్తులు వచ్చి అమ్మవారికి అంబలి సమర్పించారు. రాత్రి పూజలు చేసి కుంభ నైవేద్యం సమర్పించారు. వీధి నాటక ప్రదర్శన భక్తులను అలరించింది. జాతరలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. జాతర పెద్దలు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తాళంబేడు, నగరంలోని ఇరువారం, ప్రశాంత్‌నగర్‌లో కూడా గంగజాతర ఘనంగా నిర్వహించారు.


కొత్తపల్లెలో అమ్మవారికి కర్పూర హారతి ఇస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

బంగారుపాళెం దళితవాడలో..

బంగారుపాళెం: మంగళవారం గంగజాతర ఘనంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా ఉదయం భక్తులు అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామంలో ఊరేగించిన అనంతరం నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చనున్నారు. బుధవారం అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించనున్నారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్లను నిర్వహించనున్నారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ జలప్రవేశం చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెరియంబాడి నాగరాజు తెలిపారు. చెన్నై ఎంఎస్ కంటి ఆస్పత్రి వైద్యులచే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా స్వాధీనం

చిత్తూరు అర్బన్: ఐరాల మండలంలో మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేశారు. చిగరపల్లెకు చెందిన మధు (27 నుంచి 2లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్ట ర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 95 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంత రం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ పాల్గొన్నారు.


గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పవన్ కుమార్

నంగమంగళంలో

గుడిపాల: మండలంలోని నంగమంగళంలో మంగళవారం 104 డాక్టర్ పవన్ కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీలత, యమున, వరలక్ష్మి ఆశావర్కర్ రూబి పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్‌తో అతిసారం దూరం


అతిసారంపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఓఆర్‌ఎస్, జింక్ మందులతో అతిసార వ్యాధి దూరమవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బజారు వీధి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారికి డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆశావర్కర్లతో డాక్టర్ ప్రవీణ్కుమారసమీక్ష నిర్వహించారు. సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

డయేరియాపై అప్రమత్తం

తవణంపల్లె: ఎండల తీవ్రత, ఈగల వల్ల వ్యాపించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ, డయేరియా నివారణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. డీపీహెచ్‌ఎన్‌ఓ రేణుకాప్రభ మాట్లాడుతూ, హై రిస్క్ గర్భవతులను ముందస్తుగా ఏ హాస్పిటల్‌కు పంపాలో తెలుసుకోవాలన్నారు. అనంతరం డయేరియా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, పీహెచ్‌ఎన్‌లు భారతి, జయభారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, జయమ్మ, అమరావతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబు

ఐరాల: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసుకునే రైతులకు మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే మండలానికి 1,545 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ..

మండలంలోని పెద్దగొల్లపల్లె గృహసారథి రమేష్ కుమార్తె గౌతమి ఇటీవల మృతిచెందారు. మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రమేష్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలే ధ్యేయం

– పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిచడమే సీఎం జగనన్న ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గాండ్లపల్లె, మొగిలి మిట్టూరు, వినాయకపురం గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మొగిలి శివాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్ మనోహరి, ఎంపీటీసీ శ్యామల, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, ఎస్టీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్, నేతలు దొరస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటస్వామి, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, మునేంద్ర, బాలాజి, నాగరాజ, జగదీష్, కుమార్, సోషియల్ మీడియా కోఆర్డినేటర్ రెడ్డెప్ప, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


గాండ్లపల్లెలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

వేరుశనగ విత్తనకాయల పంపిణీ


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

పూతలపట్టు: బైటపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు వేరుశనగ విత్తనకాయలను సర్పంచ్ రామతులసీ పంపిణీ చేశారు. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు విత్తనకాయలు అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.